క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

శాయంపేట : మండలంలోని గట్లకనిపర్తి గ్రామానికి చెందిన గీత కార్మికుడు అనంతుల సుదర్శన్ బుధవారం ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వృత్తిలో భాగంగా చెట్టు ఎక్కిన సుదర్శన్ ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో కాలు విరిగింది. ముఖానికి, ఛాతీ భాగంలో గాయాలయ్యాయి. ఆయన్ను స్థానికులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. గాయాలపాలైన సుదర్శన్‌ను ఎంపీటీసీ బత్తిని రజని, సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యులు గుర్రం అశోక్, బొమ్మకంటి నాగరాజు, కుమార్, రతన్, బొమ్మకంటి రాజేందర్, నరేష్ తదితరులు పరామర్శించారు.

5నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు



కమిటీ సభ్యులతో విష్ణువర్ధన్‌రెడ్డి

దామెర : మండలంలోని కోగిల్వాయిలో ఈనెల 5నుంచి నిర్వహించనున్న శ్రీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గట్ల విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. కోగిల్వాయిలోని ఆలయంలో ఉత్సవాల నిర్వహణ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మేకల వంశీ, వైస్ చైర్మన్‌గా సంగరబోయిన వేణు, తంగెళ్ల రాజుతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడారు. చంద్రగిరి గట్లల్లో జరిగే జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అక్తర్, ఎంపీటీసీ సంగరబోయిన మౌనిక కిరణ్, ఉపసర్పంచ్ గోల్కొండ సాంబయ్య, కారోబార్ యజ్ఞం సురేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎంఎస్పీ జిల్లా కన్వీనర్‌గా గంగారపు శ్రీనివాస్



ధర్మసాగర్ : మండల కేంద్రానికి చెందిన గంగారపు శ్రీనివాస్‌ను మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్పీ) జిల్లా కన్వీనర్‌గా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్ గౌడ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం 20 ఏళ్లుగా గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ఉద్యమాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. తన పని విధానాన్ని గుర్తించి జిల్లా కన్వీనర్‌గా నియమించారని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించారంటూ ఎంఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్ గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంద కుమార్, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి మంద రాజులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు రేవంత్‌రెడ్డి రాక

భీమదేవరపల్లి : టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నేడు (గురువారం) మండలంలోని కొత్తకొండకు రానున్నట్లు హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారని పేర్కొన్నారు. అనంతరం ఉదయం 10 గంటలకు సిద్దిపేట జిల్లా అక్కెన్నపేట మండలంలోని గండిపల్లి ప్రాజెక్ట్‌ను సందర్శిస్తారని వివరించారు.

ఎమ్మెల్యే పరామర్శ



ఐనవోలు : మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన గద్దల ప్రశాంత్, బొక్కల రాజు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ బుధవారం పరామర్శించారు. అనంతరం ఆర్థికసాయం అందించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

త్వరలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

భీమదేవరపల్లి : మండలంలోని వంగరలో త్వరలోనే డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు విగ్రహావిష్కరణ కమిటీ చైర్మన్ గజ్జెల సురేష్ తెలిపారు. ఆ గ్రామంలో విగ్రహావిష్కరణ కమిటీని బుధవారం నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మంచాల సదానందం, ప్రధాన కార్యదర్శిగా కండె సుధాకర్, సభ్యులుగా ఇల్లందుల సదయ్య, కండె చక్రపాణి, కండె సంజీవ్, గౌరవ అధ్యక్షులుగా గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ నల్లగోని రాజు, మాజీ సర్పంచ్ కండె రమేష్ ఎన్నికైనట్లు బీఎస్పీ మండల శాఖ అధ్యక్షుడు తాడూరి చిరంజీవి ప్రకటించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు తాళ్లపల్లి పవన్, గడిపె భిక్షపతి, వంగ మల్లయ్య, తూముల స్వామి, అందే సాల్మన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గండ్రకు గుణపాఠం తప్పదు

● కాంగ్రెస్ నాయకుల రాస్తారోకో



పరకాల : రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పరకాల : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గుణపాఠం తప్పదని కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్సీ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అన్నారు. భూపాలపల్లిలో టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్రపై బీఆర్ఎస్ నాయకుల దాడిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. 'గండ్ర గుండాగిరి నశించాలి' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. కాంగ్రెస్ వస్తున్న ప్రజాదరణను ఓర్వలేకే ఎమ్మెల్యే అనుచరులు, బీఆర్ఎస్ నాయకులు దాడులకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ టికెట్‌తో ఎమ్మెల్యేగా గండ్ర వెంకటరమణారెడ్డి గెలిచి బీఆర్ఎస్‌లో చేరారని మండిపడ్డారు. దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలని సవాలు విసిరారు. పోలీసులు ఆందోళనకారులను అడ్డుకుని రాస్తారోకో విరమింపజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పరకాల మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఒంటేరు రామ్మూర్తి, ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ దుపాక సంతోష్, కౌన్సిలర్ పంచగిరి జయమ్మ, నడికూడ, దామెర అధ్యక్షులు బుర్ర దేవేందర్, మన్నెం ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శాయంపేట : నిరసన తెలుపుతున్న నాయకులు

శాయంపేట : కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ప్రజాదరణను ఓర్వలేకే అధికార పార్టీ నాయకులు, ఎమ్మెల్యే అనుచరులు దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు మారంపల్లి రవీందర్, నిమ్మల రమేష్, మామిడిపల్లి సాంబయ్య, వైనాల కుమారస్వామి, వలీ హైదర్, రాజ్‌కుమార్, రవిపాల్, రాజేందర్, కట్టయ్య, కుమార్, రజనీకాంత్, శంకర్, శ్రీను, సురేష్ పాల్గొన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం



ఐనవోలు : పరీక్ష చేయించుకుంటున్న శ్రీరాములు



దామెర : పరీక్ష చేయించుకుంటున్న తహసీల్దార్

ఐనవోలు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు కోరారు. మండలంలోని ఉడుతగూడెంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. 18 ఏళ్లకుపైబడిన ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సమస్యలున్న వారికి ఉచితంగా కళ్లద్దాలు అందిస్తారని, అవసరమైతే శస్త్రచికిత్సకు సిఫార్సు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బరిగల ఆరోగ్యం, ఉపసర్పంచ్ పెరుగు కిరణ్‌కుమార్, నాయకులు రాజేంద్రప్రసాద్, తాటికాయల ఆనందం, నాగమణి, మమత, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

దామెర : మండలంలోని వెంకటాపూర్‌లోని కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ కాగితాల శంకర్ ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. ప్రతిఒక్కరూ నేత్ర సంబంధిత సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. తొలుత గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, మండల వైద్యాధికారి డాక్టర్ మంజుల, వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, దళితబంధు చైర్మన్ కృష్ణమూర్తి, సర్పంచ్ పున్నం రజిత సంపత్, ఉపసర్పంచ్ గోల్కొండ సురేందర్, మాజీ ఎంపీపీ జన్ను మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని ప్రతిభ వెలికితీయడమే లక్ష్యం



మాట్లాడుతున్న శ్రీనివాస్

దామెర : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా ప్రభుత్వం 'తొలిమెట్టు' కార్యక్రమం చేపట్టిందని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 'తొలిమెట్టు' కార్యక్రమంపై మండల స్థాయిలో బుధవారం ఆయన సమీక్షించారు. పాఠశాలల వారీగా విద్యార్థుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు పాటుపడాలని సూచించారు. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంచేలా బోధించాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఎదగాలని ఆకాంక్షించారు. సమావేశంలో మండల నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, స్కూల్ కాంప్లెక్స్ నోడల్ అధికారులు రాజేశ్వరి, సత్యనారాయణ, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు రాజు, నరేష్ పాల్గొన్నారు.

భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతు



పూడ్చిన మిషన్ భగీరథ పైపులైన్ కందకం

సాక్షి ఎఫెక్ట్..

శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల మూలమలుపు మిషన్ భగీరథ లీకేజీకి మరమ్మతు చేశారు. 'భగీరథ కందకంలో పడిన గేదె' శీర్షికతో ప్రచురితమైన 'సాక్షి' కథనానికి అధికారులు స్పందించారు. అధికారుల ఆదేశాల మేరకు బుధవారం కాంట్రాక్టర్ సిబ్బందితో లీకేజీకి మరమ్మతులు చేయించి కందకాన్ని పూడ్చి వేయించారు.

ప్రభుత్వ గుర్తింపుకార్డు తప్పనిసరి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న విజయభాస్కర్

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే సభ్యులు ప్రభుత్వ గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని ఎన్నికల అధికారి విజయ్‌భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. పెద్దకోడెపాక గ్రామంలోని రైతు వేదిక ఆవరణలో (నేడు) గురువారం నిర్వహించనున్న మత్స్య సొసైటీ ఎన్నికల కోసం సిబ్బంది పోలింగ్ బూత్‌లను బుధవారం తయారు చేయగా ఆయన సందర్శించి పరిశీలించి మాట్లాడారు. సొసైటీ పరిధిలోని 13 గ్రామాల్లో 1166 మంది సభ్యులున్నారని తెలిపారు. 9 డైరెక్టర్ల స్థానాలకు గాను 39 మంది బరిలో ఉన్నారని చెప్పారు. నేడు (గురువారం) ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహిస్తామని, అలాగే మధ్యాహ్నం 1.30 గంటల నుంచి ఓట్లు లెక్కించి తదనంతరం ఫలితాలు విడుదల చేస్తామని వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా అభ్యర్థులు, సభ్యులు సహకరించాలని కోరారు.

ప్రజలకు మెరుగైన 'కార్గో' సేవలు



బుకింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బీవీకే.మూర్తి

కమలాపూర్ : టీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రజలకు మెరుగైన కార్గో సేవలు అందించనున్నట్లు పరకాల డిపో మేనేజర్ బీవీకే.మూర్తి తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్శిల్, కొరియర్, కార్గో బుకింగ్ కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండల ప్రజలకు పార్శిల్, కొరియర్, కార్గో సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా బుకింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిన్న, పెద్ద ఏ వస్తువైనా తక్కువ ధరకే హైదరాబాద్, హనుమకొండ, తదితర సెంటర్లకు రవాణా చేయనున్నట్లు చెప్పారు. పార్శిల్ బుకింగ్ కోసం సెల్ నెంబర్ 8008963615లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు ప్రశాంత్, రాకేష్, ఏజెంట్ నాగుల ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'ధరల నియంత్రణలో కేంద్రం విఫలం'

ఎల్కతుర్తి : పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, తదితర నిత్యావసర సరుకుల ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్రె లక్ష్మణ్ తెలిపారు. మండలంలోని సూరారం గ్రామంలో ఇంజాల పోచయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ఆ పార్టీ గ్రామ శాఖ మహాసభకు లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెంచి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీకి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామన్న హామీని విస్మరించిందని విమర్శించారు. కనీసం 6 గంటలు కూడా ఇవ్వడం లేదన్నారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేపట్టాలని, సర్‌చార్జీలపై పునరాలోచించాలని, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఆ పార్టీ గ్రామ శాఖ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మద్రిపల్లి తిరుమల, సహాయ కార్యదర్శిగా మారుపాక సంపత్, 9 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. మహాసభలో పార్టీ మండల కార్యదర్శి ఉట్కూరి రాములు, జిల్లా సమితి సభ్యుడు కామెర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

భూములు కాజేయడమే 'చల్లా' చరిత్ర



మాట్లాడుతున్న పెరుమాండ్ల రామకృష్ణ

పరకాల : పేదలు భూములు కాజేయడమే ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చరిత్రగా కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్సీ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టరు పెరుమండ్ల రామకృష్ణ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంపీపీ భీమగాని సౌజన్య అభివర్ణించారు. పట్టణంలోని స్వర్ణగార్డెన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెంకట్రాంరెడ్డికి పేదలకు భూములు పంచిన చరిత ఉందని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులకు దమ్ముంటే పరకాల పట్టణంలో దళితులు నివసిస్తున్న మూడు కాలనీల్లో ఒక్కరికి కూడా డబుల్ బెడ్‌రూం ఇల్లు ఎందుకు ఇవ్వలేదని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని నిలదీయాలని హితవు పలికారు. కాంగ్రెస్‌కు వస్తున్న ప్రజాదరణను ఓర్వలేకే బీఆర్ఎస్ నాయకులు ఇనగాల వెంకట్రాంరెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇనగాల వెంకట్రామిరెడ్డి సారథ్యంలో పరకాలలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేయడం ఖాయమన్నారు. డబ్బు సంచులతో కౌన్సిలర్ పదవులను దక్కించుకోవడమే కాకుండా చైర్‌పర్సన్ దక్కించుకున్న వారు కూడా వెంకట్రామిరెడ్డిపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, చర్లపల్లి సర్పంచ్ చాడ రవీందర్‌రెడ్డి, రాయపర్తి ఎంపీటీసీ మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ ఒంటేరు రామ్మూర్తి, ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ దుపాక సంతోష్, కౌన్సిలర్ పంచగిరి జయమ్మ, నాయకులు బుర్ర దేవేందర్, మన్నెం ప్రకాశ్‌రెడ్డి, ఎ.ప్రవీణ్, మహ్మద్ అలీ, రంజాన్ అలీ, క్రాంతి, జైపాల్‌రెడ్డి, శ్రవణ్, భిక్షపతి, శ్రీను, పరమేశ్వర్, సుమన్ పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ధర్మసాగర్: కన్నారంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు



ధర్మసాగర్ : వేలేరులో ప్రార్థన చేయిస్తున్న విద్యార్థులు



ఆత్మకూరు : విద్యార్థులతో ఉపాధ్యాయులు

ధర్మసాగర్ (వేలేరు) : మండలంలోని వేలేరు, కన్నారం మండల ప్రజాపరిషత్ (ఎంపీపీ) స్కూళ్లలో ప్రధానోపాధ్యాయులు హున్యానాయక్, లీలాబాయి ఆధ్వర్యంలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేలేరు పాఠశాలలో హెచ్‌ఎంగా రిషి కేతన్, కన్నారంలో శ్రీరాం, ఎంఈఓగా ప్రత్యూష్ వ్యవహరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు హున్యానాయక్, లీలాబాయి మాట్లాడారు. స్వయం పరిపాలన దినోత్సవాలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వసంత రాణి, లీలారాణి, సుజాత, ఎం.మాధవి, విజయ, ఎ.మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని గొల్లవాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన స్వయం పరిపాలన దినోత్సవంలో భాగంగా విద్యార్థులే ఉపాధ్యాయులై తరగతులు బోధించి ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆర్.లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయినులు పార్వతి, కళ్యాణి, పుష్పలత, సునీత పాల్గొన్నారు.

దేవాదుల నీటిని విడుదల చేయాలి



దేవాదుల ఎస్‌ఈకి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

భీమదేవరపల్లి : భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లోని వ్యవసాయ భూములకు దేవాదుల నీటిని విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని పార్టీ బృందం దేవాదుల ఎస్‌ఈ సుధాకర్‌కు హసన్‌పర్తి శివారులోని చింతగట్టు క్యాంప్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడారు. సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్, కొట్టె కృష్ణారెడ్డి, మార్పు సంజీవరెడ్డి, రావుల తిరుపతి ఉన్నారు.

అంగన్‌వాడీలను పర్మనెంట్ చేయండి

● యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ



మాట్లాడుతున్న పద్మ

భీమదేవరపల్లి : అంగన్‌వాడీ టీచర్లను, ఆయాలను పర్మనెంట్ చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ డిమాండ్ చేశారు. ఆ యూనియన్, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంగన్‌వాడీ ప్రాజెక్ట్ కార్యాలయాల ఎదుట కమలాపూర్, ఎల్కతుర్తి, హసన్‌పర్తి, భీమదేవరపల్లి మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షురాలు జమున, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, జమున, రమాదేవి, స్వరూప, భాగ్యలక్ష్మి, శోభారాణి, అరుణ, విమల, స్వరూప, పద్మ, లక్ష్మి, ఉమ పాల్గొన్నారు.

వర్గీకరణతోనే అన్ని రంగాల్లో న్యాయం



ధర్మసాగర్ : నివాళులర్పిస్తున్న నాయకులు



భీమదేవరపల్లిలో..

ధర్మసాగర్ : ఎస్సీ వర్గీకరణ ద్వారానే మాదిగ, ఉపకులాల ప్రజలకు విద్య, ఉద్యోగ, రాజకీయ, తదితర అన్ని రంగాల్లో న్యాయం జరుగుతుందని ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ గంగారపు శ్రీనివాస్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మాదిగ అమరవీరుల దినోత్సవానికి గంగారపు శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ 1994లో ఉద్యమాలు నిర్వహించి వర్గీకరణ సాధించగా మాల కులస్తులు సుప్రీంకోర్టులో కేసు వేసి స్టే తీసుకురావడంతో వర్గీకరణ నిలిచిపోయిందని వివరించారు. మళ్లీ వర్గీకరణకు చట్టబద్ధత సాధించే దిశగా ఉద్యమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. తొలుత మాదిగ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నక్క సుమన్, చిలుక భరత్, సురుగూరి కమలాకర్, నీలం మహేందర్, చింత రాజు, చింత అంబేడ్కర్, మంద సైమన్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

భీమదేవరపల్లి : మండలంలోని ముల్కనూర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో మాదిగ అమరవీరుల ఫొటోలకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో రేణుకుంట్ల భిక్షపతి, తాళ్లపల్లి జార్జి, ఐలపాక స్వామి, పార్నందుల మహేందర్, రవి, సునీల్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దామెర : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాదిగల సంగ్రామ పాదయాత్ర మండలంలోని ఊరుగొండకు బుధవారం చేరుకుంది. ఈ సందర్భంగా దినేష్, నాయకులు గ్రామంలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దినేష్ మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేస్తామని బీజేపీ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి ఏళ్లు గడుస్తున్న పార్లమెంటులో బిల్లు పెట్టకుండా మోసపూరితంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఈనెల 15న తలపెట్టిన రాష్ట్ర రాజధాని నిర్బంధం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మంద రాజు, గంగారపు శ్రీనివాస్, పాముల సుబ్బయ్య, బొడ్డు శాంతిసాగర్, శనిగరపు రవీందర్, కొట్టె కళ్యాణ్, చిలుక రాజు, గోవిందు రవికుమార్, జన్ను సాంబయ్య, జన్ను కమలాకర్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు చేయూత

కాజీపేట : సాఫ్ట్‌బాల్ సీనియర్ నేషనల్ సౌత్ జోన్ పోటీలకు బాలికల విభాగంలో ఎంపికైన అజ్మీరా కల్యాణి, గీతలకు ప్రోత్సాహంగా నిట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్ ప్రయాణ ఖర్చుల కోసం రూ.6,500 నగదు బుధవారం అందజేశారు. బాలుర విభాగంలో పి.దిలీప్‌కుమార్, పి.వినయ్ కుమార్ ఎంపికయ్యారు. తిరుచ్చిలో ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు పోటీలు జరుగనున్నాయి. క్రీడాకారులను సాంబశివరావు, కార్యదర్శి దాబేటి రాజేందర్, ఉపాధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి, కోచ్ తిబేటి నాగరాజు అభినందించారు. ఉత్తమ ప్రతిభ చాటి మెరుగైన ఫలితాలు సాధించి కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలని సూచించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తామని చెప్పారు.

విద్యుత్ ఉద్యోగులకు పీఆర్‌సీ ఇవ్వాలి

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగులకు వెంటనే పీఆర్‌సీ ప్రకటించాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన సమయంలో తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడారు. పీఆర్‌సీ ఇప్పటికే ఆలస్యమైందని వెంటనే పీఆర్‌సీ ప్రకటించి విద్యుత్ ఉద్యోగులకు న్యాయం చేయాలని, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు మార్చాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో వరంగల్ ఎస్‌ఈ మధుసూధన్, హనుమకొండ ఎస్‌ఈ వెంకటరమణ, నాయకులు సామ్యానాయక్, ఆనందం, సాంబరెడ్డి, కిరణ్, జానకి రాంరెడ్డి, సుబ్రమణ్యేశ్వర్ రావు, ఇంద్రసేనా రెడ్డి, మల్లికార్జున్, మహేందర్ రెడ్డి, రాజిరెడ్డి, ఓదేలు, బుచ్చయ్య గౌడ్, శ్రీరాం నాయక్, శశికుమార్, రమణా రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.